సంపుటి :02 సంచిక :114 పేజీలు :05
వెల ₹5
అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
ఉష్ణోగ్రతలు
కనిష్ఠం : 27
గరిష్ఠం : 36
సోమవారం 23, జూన్ 2025



# క్రెడాయ్ అధ్యక్షుడిగా నాయిని అమరేందర్ రెడ్డి

- చైర్మన్ గా ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి
- స్నేహ పూర్వక వాతావరణంలో ఎన్నికలు

03



# పై‘వేటు’ బడి.. దోపిడీ

- పిల్లలు ఆడుకునేందుకు ఆటస్థలాలు నిల్
- ఫైర్, భవనాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- క్షేత్రస్థాయిలో మాత్రం అవేమీ కనిపించవు..
- స్కూల్ నోటీస్ బోర్డుల్లో కనిపించని ఫీజుల పట్టిక

## వసతులు అరకొర.. ఫీజులు కొండంత

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్ల దోపిడీ పరాకాష్ఠకు చేరుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా 10 వేలకు పైగా స్కూళ్లు ఉండగా, ఉమ్మడి జిల్లాలో 500కు పైగా ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. కొన్ని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకున్నా.. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు లేకున్నా, కనీస వసతులు కల్పించకున్నా, యథేచ్ఛగా అడ్మిషన్ల దందా సాగిస్తున్నాయి. బ్రోచర్లు చూపించి రూ.25 వేలతో మొదలుపెట్టి.. రూ.2 లక్షల వరకూ ఫీజుల రూపంలో దండుకుంటున్నారు. విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు.

02

- అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి



## విద్యాసంస్థలకు 100 గజాల పరిధిలో వాటిని అమ్మొద్దు

- పొగాకు ఉత్పత్తులు, మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు
- ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్

05

# ‘రైతుభరోసా’ సంబురాలు

- రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం అన్ని మండల కేంద్రాల్లో వేడుకలు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క
- గాంధీభవన్‌లో ‘జై బాపు.. జై భీం.. జై సంవిధాన్’ సమావేశం

05



## కేబినెట్‌తో సీఎం కీలక భేటీ

- రైతుభరోసా విజయవంతంపై ప్రధాన చర్చ
- ఏపీలో బనకచర్ల ప్రాజెక్ట్‌పై కార్యాచరణ?



05

## విద్యుత్ ఉద్యోగులకు 2 శాతం డీఏ

- ఉత్తర్వులు చేసిన రాష్ట్రప్రభుత్వం
- 71,417 మంది ఉద్యోగులు, పెన్షనర్లు, ఆర్టిజన్లకు లబ్ది
- జనవరి నుంచి అమలులోకి నిర్ణయం



05

# టీపీసీసీ చీఫ్‌ను కలిసిన రేవూరి

అక్షరదర్బార్, హనుమకొండ: మంత్రి కొండా సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు సొంత పార్టీ ఎమ్మెల్యేలపై చేసిన విమర్శలు కాంగ్రెస్ పార్టీలో దుమారం రేపాయి. ఆదివారం ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవిని వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఐదుగురు ఎమ్మెల్యేలు కలిసి కొండా మురళిపై చర్యలు తీసుకోవాలని కోరిన విషయం తెలిసిందే. వీరిలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఉన్నారు. తాజాగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య సోమవారం హైదరాబాదులోని గాంధీభవన్ లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను కలిశారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, కొండా మురళిపై అందిన ఫిర్యాదులను పార్టీ అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

# పిడిసిల్ల డీలర్ సస్పెన్షన్


అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండలం పిడిసిల్ల రేషన్ డీలర్ వంగ సుధాకర్ ను మొగుళ్ళ పల్లి రెవెన్యూ అధికారులు భూపాలపల్లి జెసి ఆదేశాల మేరకు తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్టు తెలిసింది గత వారం రోజుల క్రితం రేషన్ డీలర్ వంగ సుధాకర్ షాపులో తనిఖీ చేయగా 25 కిలోల సన్న బియ్యం నిలువ ఉండటంతో.. దానికి సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు జారీ చేసి పిడిసిల్ల సమీప గ్రామమైన ఎల్లారెడ్డి పల్లె డీలర్కు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం పూర్తి వివరాల కోసం రెవెన్యూ అధికారులు అందుబాటులో లేరు.





# ప్రై'వేటు' బడి

- వసతులు అరకొర.. ఫీజులు కొండంత
- పిల్లలు ఆడుకునేందుకు ఆటస్థలాలు నిల్
- ఫైర్, భవనాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- క్షేత్రస్థాయిలో మాత్రం అవేమీ కనిపించవు..
- స్కూల్ నోటీస్ బోర్డుల్లో కనిపించని ఫీజుల పట్టిక



అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: సాధారణంగా పాఠశాల ఏర్పాటుకు సంబంధించి యాజమాన్యాలు మొత్తం 24 శాఖల నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసి) తీసుకోవాల్సి ఉంటుంది. మద్యం దుకాణాలు, ప్రార్థనా మందిరాలకు పాఠశాలలు దూరంగా ఉండాలి. కానీ, క్షేత్రస్థాయిలో కొన్ని యాజమాన్యాలు నిబంధనలు పాటించడం లేదు. కేవలం ధనార్జనే ధ్యేయంగా విద్యాలయాలు నెలకొల్పుతున్నారు. కొన్ని పాఠశాలల్లోనైతే యాజమాన్యాలు బీఈడీ, డీఈడీ, లాంగ్వేజ్ పండిట్ కోర్సులను పూర్తిచేయని వారిని ఉపాధ్యాయులుగా నియమించుకుంటున్నారు. విద్యాశాఖ ప్రమాణాలను పాటించకుండా, వివిధ శాఖల నుంచి అనుమతి తీసుకోకుండా అడ్మిషన్ల దందాను సాగిస్తున్నప్పటికీ తమకేమీ పట్ట నట్లుగా విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు.

### - కనిపించని ఫీజు బోర్డులు..

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వివరాలు బోర్డులు ఎక్కడా కన్పించడం లేదు. ఏ తరగతికి ఎంత ఫీజు వివరాలు ఆయా పాఠశాలల్లో బోర్డుల్లో కనబరచాలి. అలాంటిది ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం. ముఖ్యంగా భవన్ రిజిస్ట్రేషన్, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతి తప్పనిసరిగా ఉండాలి. కానీ, కొన్ని యాజమాన్యాలు ఇరుకిరుకు భవనాల్లో తరగతులు బోధిస్తున్నాయి.

### - కనిపించని ఆట స్థలాలు..

విద్యాహక్కు చట్టప్రకారం ప్రతి పాఠశాలకు తప్పనిసరిగా ఆట స్థలం ఉండాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో కచ్చితంగా వాటిలో విద్యార్థులను ఆడించాలి. అందుకు పీఈటీని సైతం నియమించాలి. ప్రతి జిల్లాల్లో ఏడెనిమిది స్కూళ్లలో తప్ప, మరెక్కడా యాజమాన్యాలు ఆట స్థలం నిబంధన పాటించినట్లు కనిపించడం లేదు.

### - ఫీజుల నియంత్రణపై నిఘా ఏదీ?

ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తిచేశాయి. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులను ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. నర్సరీ, ఎల్‌కేజీ స్థాయిలోనే కొన్ని స్కూళ్లు రూ.లక్షల్లో ఫీజులను వసూలు చేస్తున్నాయి. స్కూళ్లకు రకరకాల పేర్లు పెట్టి ఐఐటీ, నీట్ కోచింగ్ ఇస్తున్నామని ఫీజులను దండుకుంటున్నారు. ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు అనేకమార్లు విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ ఆచరణకు రావడం లేదు. ఈ విద్యాసంవత్సరం నుంచి ఫీజుల దోపిడీని నియంత్రిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండగా..ఇప్పటివరకు కార్యాచరణ మొదలు కాలేదు. దీన్నిబట్టి చూస్తే ప్రభుత్వ హామీ ఈ సంవత్సరం ఆచరణ సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. పాఠశాలలు పునః ప్రారంభానికి ముందే సరైన చట్టాన్ని చేస్తే ఉపయుక్తంగా ఉండేదని విద్యార్థి సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై

# శ్రద్ధ వహించండి

### - బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



అక్షరదర్బార్, వరంగల్: ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు శ్రద్ధ వహించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ హితవు పలికారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయా విభాగాల అధికారులు పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని, దరఖాస్తులు రిపీట్ కాకూడదని అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో కొనసాగుతున్న, చేపట్టే అభివృద్ధి పనులను నాణ్యతతో జరిగేలా ఇంజనీరింగ్ అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌లో ఇంజనీరింగ్ 41, హెల్త్ – సానిటేషన్ 12, ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ) 09, టౌన్ ప్లానింగ్ 68, మంచినీటి సరఫరా 03 మొత్తం 133 ఫిర్యాదులు స్వీకరించినట్లు సంబంధిత విభాగం అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్ఓ డా రాజారెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, ఇన్చార్జి ఎస్ఈ మహేందర్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, హెచ్ఓలు రమేష్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, ఏంహెచ్ఓ డా రాజేష్, టిఓ రామకృష్ణ పాల్గొన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ

# హంగు ఆర్భాటాలకే పరిమితం

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ధ్వజం
- ఇదేమి మార్పు అని ప్రజలు బాధపడుతున్నారు



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: హంగు ఆర్భాటాలకే కాంగ్రెస్ పార్టీ పరిమితమైందని భూపాలపల్లి మాజీ శాసనసభ్యులు గండ్ర వెంకటరమణారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం మొగుళ్లపల్లి మండలం అమ్మ గార్డెన్స్ లో బీఆర్ఎస్ పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశాన్ని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బలుగురు తిరుపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి భూపాలపల్లి మాజీ శాసనసభ్యులు గండ్ర వెంకటరమణ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. గండ్ర జ్యోతిరెడ్డి మాట్లాడుతూ.. దీపం ఉండగానే ఇళ్ళు చక్కబెట్టుకునే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ చేస్తోందని మండిపడ్డారు. భూపాలపల్లి నియోజకవర్గంలో ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తకి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బలుగూరి తిరుపతిరావు మాజీ జడ్పీటీసీ జోరుక సదయ్య చిట్యాల మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కొడారి రమేష్ యాదవ్ మాజీ సర్పంచులు నరహరి వెంకట్ రెడ్డి నైనకంటి ప్రభాకర్ రెడ్డి బెల్లంకొండ శాం సుందర్ రెడ్డి పిన్నింటి వెంకటరావు రంగాపురం మాజీ సర్పంచ్ రవీందర్ పెంతల రాజేందర్ రెడ్డి దానవేణి రాములు ముత్యాల శ్రీనివాస్ గడ్డం రాజు వినోద్.కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### గాజర్ల రవి కుటుంబానికి పరామర్శ..

ఎన్ కౌంటర్ లో మృతి చెందిన మావోయిస్టు కామ్రేడ్ గాజర్ల రవి, ప్రమీల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. వెలిశాల గ్రామానికే చెందిన ఆర్టీసీ బస్ డ్రైవర్ అందె రాజమల్లు కుటుంబ సభ్యులను పరామర్శించారు. బంగ్లపల్లి మాజీ సర్పంచ్ కరాబు యువరాజ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### బీఆర్ఎస్ లో చేరిన మాజీ సర్పంచ్

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్ళ పల్లి మండలం గుండ్లకర్తి తాజా మాజీ సర్పంచ్ గుడెపు శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నుంచి తిరిగి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకన్నారు. సోమవారం మొగుళ్లపల్లి మండల కేంద్రంలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా గూడెపు శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలు నచ్చక బీఆర్ఎస్ పార్టీలో తిరిగి చేరుతున్నట్లు తెలిపారు.

### సీనియర్ జర్నలిస్ట్ కు పరామర్శ..

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ గోగుల జగదీశ్వర్ అనారోగ్య కారణాలతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ శాసనసభ్యులు గండ్ర వెంకటరమణారెడ్డి గోగుల జగదీశ్వర్ ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. జగదీశ్వర్ ఆరోగ్యం మెరుగుపడాలని అతడి కుటుంబానికి తనవంతుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బలుగూరి తిరుపతిరావు బెల్లంకొండ శ్యాంసుందర్ రెడ్డి నరహరి వెంకటరెడ్డి ఉన్నారు.

# అలసత్వం వద్దు

- **ప్రజావాణిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలు**

అక్షరదర్బార్, భూపాలపల్లి: ప్రజల సమస్యలే పరిష్కార పరిష్కారంగా తీసుకున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన బాధితుల సమస్యలపై అధికారులు అలసత్వం ప్రదర్శించద్దని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు.సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల దరఖాస్తులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజావాణిలో మొత్తం 64 దరఖాస్తు వచ్చాయని, వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను కూలం కషంగా పరిశీలించి, పెండింగ్ ఉంచకుండా, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాభవన్ హైదరాబాద్ నుండి వచ్చిన దరఖాస్తులకు పరిష్కారం చూపాలని తదుపరి నివేదికలు అందచేయాలని ఆదేశించారు. ప్రజావాణి ప్రధాన ఉద్దేశం ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం చేయడమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అక్షర దర్బార్
Voice of the people
www.aksharadarbar.com
సోమవారం
23.06.2025


# క్రెడాయ్ అధ్యక్షుడుగా నాయిని అమరేందర్ రెడ్డి

- **చైర్మన్ గా ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి**
- **స్నేహ పూర్వక వాతావరణంలో ఎన్నికలు**

అక్షరదర్బార్, హనుమకొండ: కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) వరంగల్ జిల్లా కార్యవర్గ ఎన్నికలు స్నేహపూర్వక వాతావరణంలో జరిగాయి. క్రెడాయ్ అనేది భారత దేశంలోని ప్రైవేటు రియల్ ఎస్టేట్ డెవలపర్ల అత్యున్నత సంస్థ. ఈ సంస్థను భారతీయ రియల్ ఎస్టేట్ పరిశ్రమ ప్రకృతి దృశ్యాన్ని మార్చి, హౌసింగ్, ఆవాసాలు కొనసాగించే లక్ష్యంతో 1999లో స్థాపించారు. అయితే వరంగల్ జిల్లా క్రెడాయ్ 2025- 2027 సంవత్సరాలకు గాను ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా ఒద్దిరాజు గణేష్, రాజ్ కుమార్ అగర్వాల్, గట్టు మహేష్ బాబు, మిట్టి ప్రసాద్ లు వ్యవహరించారు. వరంగల్ జిల్లా క్రెడాయ్ చైర్మన్ గా ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి, అధ్యక్షుడుగా నాయిని అమరేందర్ రెడ్డి, అధ్యక్షుడు- ఎలెక్ట్ గా కంది శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా రాజేందర్ రెడ్డి, రజినీకాంత్ రెడ్డి, రవిందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శాఖమూరి అమరేశ్వర్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజ్ కుమార్, జాయింట్ సెక్రటరీలుగా కొండారెడ్డి, నాగరాజు, వెంకట మల్లారెడ్డి, కోశాధికారిగా అగర్వాల్ కార్యవర్గ సభ్యులుగా మహేష్ బాబు, రిషిత్ రెడ్డి, బాబురావు, పిన్నింటి వెంకటేశ్వర్ రావు, సుగుణాకర్ రావు, వెంకటేశ్వర్లు, రఘువీర్, సుధీర్ రెడ్డి, ఏక్ సాయి కుమార్, నందూరి శ్రీనివాస్ లు ఎన్నికయ్యారు. చాలా పదవులకు ఏకగ్రీవం కాగా కొన్ని పదవులకు పోటీ నెలకొనడంతో పోలింగ్ జరిగింది. 132 ఓట్లు పోలైనట్లు చీఫ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఒద్దిరాజు గణేష్ ప్రకటించారు. ఈ సందర్భంగా క్రెడాయ్ రాష్ట్ర నాయకులు ప్రేమ్ సాగర్ రెడ్డి మాట్లాడుతూ స్నేహపూర్వకంగా జరిగిన వరంగల్ జిల్లా క్రెడాయ్ ఎన్నికలు ఎందరికో ఆదర్శంగా నిలిచారని అన్నారు. గెలుపు ఓటములు సహజమని, పరాజయం పొందిన వారు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, నేటి ఓటమి భవిష్యత్తులో గెలుపునకు నాంది కాగలదని ప్రేమ్ సాగర్ రెడ్డి అన్నారు. గెలుపొందిన అభ్యర్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ జిల్లా క్రెడాయ్ నూతన అధ్యక్షుడు నాయిని అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ సభ్యుల సంక్షేమానికి పాటుపడతానని అన్నారు. ప్రభుత్వం తరుపున డెవలపర్స్ కు తగిన సహాయసహకారాలు అందించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తమపై ఎంతో నమ్మకంతో ఎన్నుకున్న ప్రతి సభ్యుడికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

**- చైర్మన్ గా ఎదిగిన ఎర్రబెల్లి**

కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) 2022-2024 టర్మ్ వరంగల్ జిల్లా తాజా మాజీ అధ్యక్షుడు ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి చైర్మన్ గా ఎన్నికయ్యారు. వరంగల్ జిల్లా క్రెడాయ్ 2025- 2027 కార్యవర్గంలో ఈ చైర్మన్ పదవి క్రియేట్ చేయబడింది. గత 2023- 2025 సంవత్సరానికి గాను కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో ఎలాంటి ప్యానల్ లేకుండా అధ్యక్ష పదవికి పోటీ చేసిన ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి అనూహ్యంగా గెలుపొంది అందరిని ఆశ్చర్యపరిచారు. ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో మూడు రోజుల పాటు ప్రాపర్టీ షో నిర్వహించి గ్రేటర్ వరంగల్ నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకునేందుకు కృషి చేశారు. అంతేకాకుండా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి క్రెడాయ్ లో ఎర్రబెల్లి తన మార్క్ చాటారు. నాయకత్వ లక్షణాలతో ఉత్సాహంగా పనిచేస్తున్న ఎర్రబెల్లి తిరుపతి రెడ్డిని కంటిన్యూ చేయడంలో భాగంగానే చైర్మన్ పదవి క్రియేట్ చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా క్రెడాయ్ వరంగల్ జిల్లా 2027- 2029 సంవత్సరాల టర్మ్ కాబోయే అధ్యక్షుడుగా కంది శ్రీనివాస్ రెడ్డిని ఎంపిక చేశారు. అందులో భాగంగా కంది శ్రీనివాస్ రెడ్డిని ప్రస్తుతం అధ్యక్షుడు-ఎలక్ట్ గా ప్రకటించారు. దీంతో క్రెడాయ్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.



క్రెడాయ్ అధ్యక్షుడుగా ఎన్నికైన నాయిని అమరేందర్ రెడ్డి



చైర్మన్ ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి

# కానిస్టేబుల్ ను అభినందించిన సీపీ

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆర్మ్డ్ రిజర్వ్ విభాగంలో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న సాయిరాం గత వారం క్లాషిల్లా వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో నిర్వహించిన అతి పెద్ద పరుగు పోటీలో పాల్గొని సిల్వర్ మెడల్ ను సాధించాడు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సోమవారం సాయిరాంను అభినందించడంతో పాటు రాబోవు రోజుల్లో మరిన్ని పతకాలను సాధించాలని, క్రీడల్లో రాణిం చే పోలీస్ క్రీడాకారులను ప్రోత్సాహం అందించడం జరుగుతుందని అన్నా రు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేష్ కుమార్, అడ్మిన్ ఆర్ఐ స్పర్జన్ రాజ్ పాల్గొన్నారు.



# ఎడ్లను దొంగలించిన వ్యక్తి అరెస్ట్

అక్షర దర్బార్, శాయంపేట : ఏడ్లను దొంగలించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు శాయంపేట సిఐ రంజితరావు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మండలంలోని గోవిందా పూర్ గ్రామానికి చెందిన మందాటి కుమారస్వామి యొక్క ఎద్దులు గత గురువారం తెల్లవారుజామున నాడు గుర్తు తెలియని వ్యక్తులు రెండు ఎడ్లు దొంగలించారని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా గత శనివారం నాడు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.కేసు దర్యాప్తులో భాగంగాఎడ్లను దొంగలించిన వ్యక్తి పెద్ద కోడెపాక గ్రామానికి చెందిన కో గీల రాజుగా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.ఎడ్లను దొంగలించిన వ్యక్తిని త్వరితగతిన పట్టుకున్న కానిస్టేబుల్ సతీష్ మరియు ఖలీదులను శాయంపేట సిఐ రంజితరావు రివార్డు ప్రకటించి అభినందించారు.



# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

అక్షరదర్బార్, భూపాలపల్లి : సీజనల్ పరంగా వచ్చే వ్యాధులు, డయేరియా (అతిసార)వ్యాధి బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్టాప్ డయేరియా 2025 క్యాంపెయిన్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0-5 సంవత్సరాల చిన్నారులు ఈ అతిసార వ్యాధి బారిన పడే అవకాశం ఉందని, వారి విషయంలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అంగన్ వాడి కేంద్రాలు, పాఠశాలల్లో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశా సూపర్వైజర్లు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ క్యాంపెయిన్ ద్వారా పిల్లలు, గర్భిణీలు, వృద్ధులలో డయేరియా కేసులు పూర్తిగా తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా 5 సంవత్సరాలు వయస్సున్న పిల్లల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పారిశుధ్యం, వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు తరచూ చేతులను సబ్బుతో కడగాలని సూచించారు. డయేరియా వ్యాది సోకితే తక్షణమే వైద్యులను సంప్రదించి వైద్య సేవలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఈఓ రాజేందర్, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, బీసీ సంక్షేమ అధికారి క్రాంతి కిరణ్, ఆర్డీఓ రవి, వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



# బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడుగా ఈవీ

అక్షరదర్బార్, హనుమకొండ: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వరంగల్ రీజియన్ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడుగా టిపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాసరావు నియమితులయ్యారు. సోమవారం సంఘానికి చెందిన వరంగల్ రీజియన్ అధ్యక్షుడు గొలనుకొండ వేణు, సెక్రటరీ మాదారపు సాంబయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు శ్రీనివాస్, హన్మకొండ డిపో చీఫ్ అడ్వైజర్ బీఎన్ చారీ, డిపో సెక్రటరీ విమలాకర్, వరంగల్-1 డిపో అధ్యక్షుడు దుంపేటి యాదగిరి, సెక్రటరీ పోతరాజు రమేష్ లు ఈవీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి గౌరవ అధ్యక్షుడుగా కొనసాగాలని విజ్ఞప్తి చేయగా ఆయన అంగీకరించారు. ఈ సందర్భంగా ఈవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆర్టీసీలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి నేను పూర్తిగా అండగా ఉంటానని, వారికి ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మంగళవారం జరగనున్న సంఘం 8వ రాష్ట్ర మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను గౌరవ అధ్యక్షుడు ఆవిష్కరించారు.



# పంచాయతీ ఎన్నికల నిర్వహణపై తీర్పు రిజర్వ్

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల అంశంపై హైకోర్టులో ఎన్నికల కమిషన్, ప్రభుత్వం, పిటిషనర్ల వాదనలు ముగిశాయి. ఎన్నికల నిర్వహణకు నెల రోజుల గడువు ఇవ్వాలని ప్రభుత్వం కోరగా.. ఎన్నికల సంఘం 60 రోజులు గడువు కోరింది. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహించడం లేదంటూ దాదాపు ఆరు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. దీనిపై గత కొన్నాళ్లుగా వాదనలు కొనసాగుతున్నాయి.



# శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ త్యాగం మరువలేనిది

అక్షర దర్బార్, నర్సంపేట : ఒకే రాజ్యాంగం ,ఒకే ప్రధాని, ఒకే చట్టం ఉండాలని ఆశించిన గొప్ప జాతీయవాది శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ త్యాగం మరువలేదని భారతీయ జనతా పార్టీ నర్సంపేట పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్  అన్నారు. సోమవారం బిజెపి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ (జనసంఘ్) వ్యవస్థాపకులు వర్ధంతి బలిదాన్ దివాస్ సందర్భంగా  బీజేపీ నాయకులతో కలిసి నర్సంపేట పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అన్నారు  కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మల్యాల  వినయ్ కుమార్, మాజీ కౌన్సిలర్ బోడ గోల్యా నాయక్,జిల్లా కౌన్సిల్ మెంబర్ పొదిళ్ల రామచందర్,నర్సంపేట పట్టణ ప్రధాన కార్యదర్శిలు కందికొండ శ్రీనివాస్, సూత్రపు సరిత, మహిళా మోర్చా నాయకురాలు మార్త సంధ్యారాణి, బీజేవైఎం జిల్లా నాయకులు జూలూరి మనీష్ గౌడ్, అచ్చ దయాకర్, కొంకీస విగ్నేష్ గౌడ్,చిలువేరు అన్వేష్ నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షులు కాసుల నాగేంద్రబాబు,  కందగట్ల నాగరాజు, పోనుగోడు రవీంద్ర చారి, తౌటమ్ నిశాంత్, ముత్యాల శ్రీనివాస్, మాస్ శివ, చేను నరేష్, తప్పెట్ల సతీష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**నేటి తరానికి స్ఫూర్తి**

అక్షర దర్బార్, పరకాల : శ్యాం ప్రసాద్ ముఖర్జీ నేటి యువతరానికి స్ఫూర్తి అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరకాల ప్రముఖ వైద్యులు డా. సిరంగి సంతోష్ కుమార్ పేర్కొన్నారు. మాజీ కేంద్రమంత్రి, జనసంఘ్ పార్టీ స్థాపకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురు ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ ఆర్పీ జయంతి లాల్, మాజీ పరకాల మున్సిపల్ చైర్మన్ మార్త రాజభద్రయ్య, మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి, పట్టణ ప్రధాన కార్యదర్శి పాలకుర్తి తిరుపతి, పట్టణ ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్, నాయకులు మారేడుగొండ భాస్కరాచారి, కుక్కల విజయ్ కుమార్, వెనిశెట్టి శారద, కానుగుల గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

**చిట్యాలలో..**

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ 72వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బుర్ర వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఒక హిందూ భావాజాలం కలిగిన వ్యక్తి అఖండ భారతావనిని నిర్మించాలని దృఢ సంకల్పంతో అహర్నిశలు దేశం కోసం పరితపించిన మహనీయుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు.  కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు తీగల జగ్గయ్య సీనియర్ నాయకుడు సుద్దాల వెంకట రాజ వీరుగుండ సురేష్ గోపగాని స్వామి వెంకటేశ్వర్లు మార్త అశోక్ రాయిని శ్రీనివాస్ సారంగపాణి చింతల రాజేందర్ సాదా సదానందం  అనుప మహేష్ కేంసారపు  ప్రభాకర్ రాకేం శ్రావణ్ సూర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేటలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సందీప్ బిజెపి నాయకులు



పరకాలలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు




చిట్యాలలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

# ప్రక్షాళన షురూ..

- అదనపు పదవులను తొలగించిన కమిషనర్
- పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవంటూ హెచ్చరికలు




అక్షర దర్బార్, పరకాల : పరకాల మున్సిపాలిటీలో సిబ్బంది అవకతవకలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందడంతో నూతనంగా కమిషనర్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన సుష్మ సోమవారం మున్సిపాలిటీలో శానిటేషన్ ఇన్ స్పెక్టర్, సెకండ్ వార్డ్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న రవిని బాధ్యతల నుండి తొలగించారు. సెకండ్ వార్డ్ ఇంచార్జ్ వార్డ్ ఆఫీసర్ గా బిల్ కలెక్టర్ కృష్ణంరాజుకు అప్పగించినట్లు తెలిపారు. మున్సిపల్ సిబ్బందికి అదనపు బాధ్యతలు కాకుండా వారు చేయాల్సిన పనిని చేసేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు కమిషనర్ సుష్మ తెలిపారు. పనుల్లో అలసత్వం వహిస్తున్న సిబ్బందిపై, వార్డులను పరిశుభ్రంగా ఉంచని శానిటేషన్ సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపాలిటీలో ప్రతి ఉద్యోగి తమ బాధ్యతలు సక్రమంగా నిర్వహించి మున్సిపాలిటీకి మంచి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు.


# జీఎంపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పయ్యావుల, బొల్లం

అక్షరదర్బార్, మహబూబాబాద్: గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పయ్యావుల మల్లయ్య, బొల్లం అశోక్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ తెలిపారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన సంఘం మహాసభలో    ఉడుత రవీందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, సంఘం ఆధ్వర్యంలో నిత్యం గొర్రెల పెంపకం దారుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు ఉధృతం చేయాలని ఈ సందర్భంగా అన్నారు. జిల్లాలో 559, 1016 జీవోలను పటిష్టంగా అమలు జరిపేలా చూడాలని వారు అన్నారు. 50 సంవత్సరాల నుంచి గొర్రెల కాపరులకు వృత్తిదారుల పెన్షన్ రూ.3 వేలు ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రభుత్వంను డిమాండ్ చేశారు.



# చిన్నారిని ఆశీర్వదించిన చిలువేరు సమ్మిగౌడ్

అక్షర దర్బార్, కేసముద్రం :  ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కంది మమత- సతీష్ దంపతుల కుమార్తె మహంతి నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ వేడుకలో సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధినేత, కాంగ్రెస్ నేత చిలువేరు సమ్మయ్య గౌడ్ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో చాగంటి రాములు,పెద్ది విజేందర్,మునికుంట్ల కన్నయ్య,కంకల బీరయ్య, ప్రవీణ్ కుమార్,వచ్చాల సాంబయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# శంకరా ఇదేమి

**-రేషన్ కార్డు దరఖాస్తుల ఎంక్వైరీలో మాయాజాలం**



అక్షరదర్బార్, పరకాల: పర్యవేక్షణ లోపించటం వల్ల కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగులు కొందరు ఇష్టారాజ్యంగ వ్యవహరిస్తున్నారు. స్వప్రయోజనాల కోసం ప్రభుత్వ నిబంధనలను పక్కన పెడుతున్నారు. తమకు ముడుపులు సమర్పించిన వారి పనులు మాత్రమే చేసి పెడుతున్నారు. హనుమకొండ జిల్లా పరకాల తహసిల్దార్ కార్యాలయంలో ఇదే పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. ఈ కార్యాలయంలో శంకరుడి ఆశీస్సులు పొందితేనే కొత్త రేషన్ కార్డు దరఖాస్తుదారులకు పని జరిగే విధానం కొనసాగుతున్నట్లు సమాచారం. రేషన్ కార్డు లేని వారు కొత్త రేషన్ కార్డు కోసం మీసేవ కేంద్రాల ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేస్తున్నారు. వీటిని పరిశీలిస్తున్న అధికారులు క్షేత్రస్థాయిలో ఎంక్వైరీ బాధ్యతలను తమ కార్యాలయంలోని ఉద్యోగులకు అప్పగిస్తున్నారు. ఈ క్రమంలో ఉద్యోగులు కొందరు ఎంక్వైరీలో భాగంగా గ్రామాల్లో తమకు ముడుపులు ముట్టజెప్పిన వారి రేషన్ కార్డు దరఖాస్తులను ఓకే చేస్తున్నట్లు తెలిసింది. దీంతో ముందుగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసిన వారి దరఖాస్తులు ఎంక్వైరీకి నోచుకోకుండా అలాగే ఉండిపోతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయంలోని ఓ ఉద్యోగి కీలకంగా వ్యవహరిస్తున్నారనే టాక్ వినపడుతుంది. ఈ నేపథ్యంలో నిబంధనల ప్రకారం రేషన్ కార్డు దరఖాస్తుల ఎంక్వైరీ జరిగేలా, రేషన్ కార్డుల మంజూరి అయ్యేలా అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

# పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

**- తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం**

అక్షరదర్బార్, హనుమకొండ: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం వరంగల్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎన్ సీతారాంరెడ్డి అధ్యక్షతన సంఘం సమావేశం ఇక్కడ జరిగింది. ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం మోహన్ నారాయణ, ఎస్ నర్సరాజు పాల్గొన్న సమావేశానికి ములుగు, జనగామ, మహబూబాబాద్, హనుమకొండ, భూపాలపల్లి, వరంగల్ జిల్లాల సంఘం నాయకులు హాజరయ్యారు. పెండింగ్ లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని, ప్రభుత్వం ప్రకటించిన ఈహెచ్ ఎస్ ఉద్యోగుల ఆరోగ్య పథకం తగిన మార్గదర్శకాలతో వెంటనే అమలు చేయాలని, 25 శాతం ఐఆర్ తో కొత్త పీఆర్సీ కోసం ప్రకటించాలని, కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల వ్యతిరేక చట్టం - 2025ను వెంటనే రద్దు చేయాలని, ఆ చట్టం నిలుపుదలకు తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పెన్షనర్లు సంతకాలతో జిల్లా కలెక్టర్ల ద్వారా ప్రధానమంత్రికి విజ్ఞాపన పత్రం అందజేయాలని, పెన్షనర్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఈ సమావేశంలో తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో టీజీవో టీజీవో వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఏ జగన్మోహన్ రావు, కార్యవర్గ సభ్యులతోపాటు పెన్షనర్ల సంఘం రాష్ట్ర నాయకులు జి వీరస్వామి, సుదర్శన్ రెడ్డి, సీహెచ్ రవీందర్ రెడ్డి, చిరంజీవి, కె రమేష్, అనిల్ కుమార్ రెడ్డి, జి రవీందర్, యాదగిరి, నారాయణ, ఫణికుమార్, ప్రకాష్ చారి, లక్ష్మణ్, శివాజీ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.






# విద్యుత్ ఉద్యోగులకు 2 శాతం డీఏ

- ఉత్తర్వులు చేసిన రాష్ట్రప్రభుత్వం
- 71,417 మంది ఉద్యోగులు, పెన్షనర్లు, ఆర్టిజన్లకు లబ్ధి
- జనవరి నుంచి అమలులోకి నిర్ణయం

అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆ శాఖ ఉద్యోగులకు రెండు శాతం డీఏ పెంచుతూ శనివారం నిర్ణయం తీసుకున్నది. ఈ ఏడాది జనవరి నుంచే అమల్లోకి వస్తోందని స్పష్టం చేసింది. విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ 1.944 శాతానికి పెంచాలని ప్రభుత్వం గతంలోనే సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నది. కానీ, అతకంటే మించి 2 శాతం డీఏను ప్రభుత్వం అమలు చేస్తున్నది. తాజా నిర్ణయంతో విద్యుత్‌శాఖ పరిధిలో 71,417 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ నిర్ణయంతో మొత్తంగాద గతంలో 14.074 శాతం డీఏ, ఇప్పుడు 16.018 శాతానికి పెరిగింది. పెంచిన డీఏతో విద్యుత్ సంస్థపై ప్రతి నెలా రూ.11.193 కోట్ల భారం పడుతుంది. అయినప్పటికీ ప్రభుత్వం డీఏ పెంపు నిర్ణయం తీసుకున్నది. ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లు కలిపి రాష్ట్రవ్యాప్తంగా 71,417 మంది ఉన్నారు. వీరి ట్రాన్స్‌కో పరిధిలో 9,318 మంది, జెన్‌కోపరిధిలో 13,730 మంది, ఎస్పీడీసీఎల్ పరిధిలో 28,991, ఎన్పీడీసీఎల్ పరిధిలో 19,378 మంది ఉన్నారు.

# 100 గజాల పరిధిలో విక్రయించొద్దు

- పొగాకు ఉత్పత్తులు, మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు
- ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్



అక్షరదర్బార్, ములుగు: ములుగు జిల్లాలోని విద్యాసంస్థలకు 100 గజాల పరిధిలో ఉన్న దుకాణాలు, వ్యాపార సముదాయాలలో సిగరెట్, గుట్కా, తంబాకు వంటి పొగాకు ఉత్పత్తులు అమ్మకూడదని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని డ్రగ్ రహిత రాష్ట్రంగా మార్చే క్రమంలో ములుగు జిల్లాను కూడా డ్రగ్ రహిత జిల్లాగా మార్చే దిశగా, యువతను, ప్రజలను మమేకం చేస్తూ మత్తు మాదకద్రవ్యాలపై విస్తృత అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. విద్యాసంస్థలు ఉన్న ప్రదేశాల్లో 100 గజాల పరిధిలో సిగరెట్, గుట్కా, తంబాకు వంటి పొగాకు ఉత్పత్తులు, మద్యం విక్రయించకూడదని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కేబినెట్‌తో సీఎం కీలక భేటీ

- రైతుభరోసా విజయవంతంపై ప్రధాన చర్చ
- ఏపీలో బనకచర్ల ప్రాజెక్ట్‌పై కార్యాచరణ?



అక్షరదర్బార్, హైదరాబాద్: హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రమంత్రి వర్గం భేటీ అయింది. సీఎం ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఏపీలో బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంపై ప్రధానంగా చర్చ జరుగిందని తెలిసింది. ఇదే అంశంపై సర్కార్ ఇటీవల అఖిలపక్ష ఎంపీల సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. అలాగే సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి మరీ ప్రాజెక్టును అడ్డుకోవాలని కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు అందజేశారు. మంత్రివర్గ భేటీలో బనకచర్లపై మున్ముందు ఎలాంటి కార్యాచరణ అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చారనేది తెలియాల్సి ఉంది. అలాగే రైతుభరోసా అమలు, స్థానిక సంస్థల ఎన్నికలు, ఫోన్‌ట్యాపింగ్ కేసు పూర్వాపరాలపైనా సీఎం చర్చించిన్నట్లు సమాచారం. రైతుల ఖాతాల్లో రైతుభరోసా జమ అయినందున ఏదైనా వేడుక నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. స్పోర్ట్స్ పాలసీ, కాళేశ్వరం కమిషన్‌పైనా ప్రాథమికంగా చర్చించినట్లు తెలుస్తున్నది.

# 'రైతుభరోసా' సంబురాలు

- రాష్ట్రవ్యాప్తంగా రేపు వేడుకలు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క
- గాంధీభవన్‌లో 'జై బాపు..జై భీం..జై సంవిధాన్' సమావేశం



అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో ఎకరానికి రూ.12 వేల చొప్పున రైతుభరోసా సొమ్ము జమ చేసిందని, పథకం విజయవంతమైన సందర్భంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో వేడుకలు నిర్వహించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన 'జై బాపు.. జై భీం.. జై సంవిధాన్' కో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 1.49 కోట్ల ఎకరాల భూమికి పెట్టుబడి సాయం అందించిన్నారు. ఆ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని కొనియాడారు. జూన్ 24తో జమ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, సీడబ్ల్యూసీ సభ్యులు వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. ''రాజ్యాంగ పరిరక్షణకు జై సంవిధాన్ కార్యక్రమంపై అవగాహన పెంచాలి. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత నాయకులపై ఉంది. సీనియర్లు, జూనియర్లు సమన్వయంతో కలిసి పనిచేయాలి''అని సూచించారు.

# క్రీడలతో దేశానికి అంతర్జాతీయ ప్రతిష్ట

అక్షరదర్బార్, వరంగల్: దేశ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో పెంపొందించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని వరంగల్ జిల్లా పరిషత్ సీఈవో జి.రామ్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ ఒలంపిక్ డే సెలబ్రేషన్స్ లో భాగంగా సోమవారం వరంగల్ పోచమ్మమైదానం జంక్షన్ నుంచి కాశిబుగ్గలోని ఓసిటీ స్టేడియం వరకు ఒలంపిక్ డే రన్ నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాంరెడ్డి మాట్లాడుతూ 140 కోట్ల జనాభాలో మనం ఎన్ని పతకాలను సాధించాము... అనే ప్రశ్న కంటే మన వంతుగా మన ఇంట్లో ఉన్న పిల్లలను ఎంతమందిని క్రీడారంగానికి పరిచయం చేస్తున్నామనే ప్రశ్నను ఎవరికి వారు వేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సత్యవాణి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, రైజింగ్‌సన్ విద్యా సంస్థల చైర్మన్ షణ్ముఖచారి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సెక్రటరీ కైలాష్‌యాదవ్ పాల్గొన్నారు. అనంతరం 'ఓ సిటీ స్టేడియం'లో క్రీడాకారులకు మెడల్స్ ను బొమ్మినేని రవీందర్‌రెడ్డి అందజేశారు.



Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : akshardarbarnews@gmail.com, office No : 7680992278 ★ RNI NO. TELTEL/2022/81915